


# అలియాస్


భారతీకృష్ణ

'లైటు వేయద్దు. నీ ఇంటి మీద పోలీసు కన్ను ఉంది. ఈ వీధి చివర రాత్రంతా కూడా తెరచి ఉండే ఎస్టీడీ బూత్‌లో పని చేసే కుర్రాడు పోలీసులకు ఇన్ఫార్మర్. ఏ క్షణాన ఈ ఇంటి మీద ఎలాంటి అనుమానం వచ్చినా ఒక్క ఫోన్ కాల్‌తో పోలీసుల్ని ఇక్కడకు రప్పించేస్తాడు. ఇదివరకు కూడా ఇలాగే నాలుగైదు సార్లు జరిగింది. పోలీసులు మఫ్టీలోనే వచ్చి నీ ఇంటికి నాలుగు వైపులా తెల్లారే వరకు పొంచి చూశారు. అనుమానమే తప్ప వారికి రైడ్ చేయాల్సిన అవసరం కనిపించ లేదు. తిరిగి వెళ్లిపోయారు.

అలాంటిది ఈ రాత్రి పదకొండు గంటలు దాటున్న వేళ నువ్వు లైటు వేశావంటే మళ్లీ ఎస్టీడీ బూత్ వాడికి అనుమానం రావచ్చు.

పోలీసులు రావడం అంటూ జరిగితే నాకు ఇబ్బంది అయిపోతుంది. గూటిలో ఉండగానే పట్టి పంజరంలో పెట్టేస్తారు. పంజరంలోనే పెడతారో... లేదా.... అవన్నీ ఇప్పుడెందుకులే. నేను వచ్చి నాలుగు రోజులైంది. ఈ నాల్రోజులూ రెండే టీలతో గడచిపోయాయి. ఏ టీ కొట్టులోనూ ఐదు నిముషాలు స్థిమితంగా కూర్చోలేని పరిస్థితి. నన్ను వెన్నంటి నా నీడ ఉంటోందనుకుంటే, ఆ నీడ జాడ దొరికినా పట్టేసుకోవాలని పోలీసులు. అందుకే ఎటు వెళ్తున్నానో.... ఏం చేస్తున్నానో.... ముందుగా నీడకు కూడా తెలియకుండా తిరుగుతూ గడిపాను. చేయాల్సిన పనులన్నీ ఇవ్వాళ్టి రాత్రికే పూర్తయ్యాయి. అటునుంచి అటే జారుకునేసే వాణ్నే. అంతలో ఎందుకో నిన్ను చూడాలనిపించింది. అందుకే సద్దు లేకుండా గుడిసె తలుపు నేనే తప్పించేసి నేరుగా లోపలికొచ్చేశాను. భయపళ్లేదు కదా! పోన్లే. చెప్పాను కదా, మెతుకు గతికి నాలుగు రోజులౌతోంది. ఏమైనా ఉంటే కంచంలో పడేయ్. నాకు అట్టే సేపు ఆగేందుకు కుదరదు. చీకటి చిక్కగా ఉండగానే అందులో కలిసిపోవాలి. వేగుచుక్క పొడిచిందంటే మనకిక చుక్కెదురే. వింటున్నావా... ఆకలేస్తోంది...'

రెక్కల్లేని కిటికీలోంచి వీధి చివర ఎస్టీడీ బూత్‌కేసి భయంభయంగా చూస్తూ మాటల్ని పరధ్యానంగా వింటున్న అతనికి, కొంచెం హెచ్చుస్వరంలో 'ఆకలేస్తోంది' అన్న పదం ఒక్కటే స్పష్టంగా వినిపించింది. గుండెలోంచి ఒక నీటి చుక్క కనుకొలకుల్లోకి వచ్చినట్లనిపించింది. అసలే చీకటిగా ఉన్న ఇంట్లో నీళ్లు నిల్చిన కళ్లతో ఏమీ కనిపించకుండా ఉంటే వాటిని చేత్తో తుడుచుకుంటూ వెళ్లి కంచం తెచ్చి పెట్టాడు. మిగిలిన అన్నంలో అప్పటికే నీళ్లు పోసి




ఉంచేశాడు. మర్రోజు చద్ది తాగొచ్చని. ఆ నీళ్లు వంచేసి, ఆ అన్నమే కంచంలో వేశాడు. ఉట్టి మీద నుంచి దించి కొద్దిగా మామిడికాయ పచ్చడీ, ఊరగాయ చెక్కా అందులో వేశాడు. రుచెరగని ఆ ఆకలి ఆవురావురుమంటూ తింటుంటే ఏం మాట్లాడాలో తోచనట్టు చూస్తూ నించున్నాడు.

కంచంలో చేయి కడిగేసి, చొక్కాకే తుడిచేసుకుని, పైకి లేస్తూ 'ఇదిగో ఈ వెయ్యా ఉంచు. దోచుకుందీ కాదు. దొంగనోట్లూ కాదు. నిర్భయంగా ఖర్చు పెట్టుకోవచ్చు. అయినా జాగ్రత్తగానే వాడుకో. మళ్లీ నేనెల్లాకొస్తానో చెప్పలేను' ఎలా వచ్చాడో అలాగే సద్దు లేకుండా గుడిసె తలుపు తీసి చీకట్లోకి జారుకున్నాడు.

ఒకరి మొహాల్ని ఒకరికి అప్పటివరకు అస్పష్టంగా చూపిన జీరోవాట్ బల్బు దేవుడి పటాల దగ్గర అలాగే నిశ్చలంగా వెలుగుతోంది. అతడు వెళ్లిన వెంటనే మంచంపై పడుకున్నవాడు, ఆ తర్వాత చాలా సేపటికి నిద్రలోకి జారుకున్నాడు.

***

అలాంటి వింతను ఆ పల్లె వాసులు అదివరలో ఎన్నడూ చూసి ఎరగరు. అది కూడా పాతికేళ్ల కిందటి సంగతి. అప్పట్లో ఆ ఊళ్లో వాళ్లకి వింత ప్లస్ అద్భుతం జరిగింది. ఆ ఊళ్లో ఓ మహిళ కవలల్ని ప్రసవించడం వింత అయితే, పిల్లలిద్దరూ బతికి బయటపడడం వారికి అద్భుతం. అంతకుముందు ఒకటి రెండుసార్లు గ్రామంలో ఒకరిద్దరికి కవలలు పుట్టినా తల్లీపిల్లలూ ముగ్గురూ చనిపోవడమే జరిగింది. ఆ దఫా మాత్రం తల్లి ఒక్కర్తే కన్ను మూసింది. పిల్లలు బతకడం అంటేనే వారికి అద్భుతం అనిపించింది. వాడవాడంతా తిరణాల మాదిరిగా ఆ ఇంటికొచ్చి పిల్లలిద్దర్నీ చూసి వెళ్లారు. అందరూ వెళ్లాక వెంకటడికి పాలకోసం రోదించే పిల్లలిద్దరే మిగిలారు. రోజుకూలీ పనికి వెళ్లి వచ్చిన బత్తెంతో కూటికి గడుపుకోవడమే తెలుసు వాడికి. కట్టుకున్నది కాలం చేసేస్తే దాని కడుపు చించుకుపుట్టిన పసిగుడ్డుల్ని కంటికి రెప్పలా కాయడం వాడి వల్ల కాలేదు. కాటికి కాళ్లు చాపుకుని ఒంటరిగా బతుకు వెళ్లదీస్తున్న తనకు పిన్ని వరస అయ్యే ఒక ముసలావిడను తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. ఇద్దరు పిల్లలూ అంటే వాడికి ప్రాణంగా ఉండేది. శివుడు, కేశవుడు అని పేర్లు పెట్టుకున్నాడు. పసిమి రంగు, మెరిసిపోయే వర్ఛస్సూ లేకపోయినా, శివకేశవులిద్దరూ ఉన్నంతలో శుభ్రంగా ముచ్చటగా ఉండేవారు. ముసలమ్మ వారి పోషణ శ్రద్ధగా చూసుకుంటుండేది. వారి చదువులు, సంధ్యలు ఆ ఊళ్లోనే సాగాయి. ఊరి గడప దాటకుండానే పది గట్టెక్కిన తర్వాత టౌన్లో ఇంటర్మీడియట్ చేరారు. రెండేళ్లయ్యాక కేశవుడు డిగ్రీలో చేరాడు. శివుడిక ఇంటికొచ్చేయాల్సి వచ్చింది. కూలికెళ్లి సంపాదించే పని వాడి వంతయింది. సాగినన్నాళ్లూ కాయకష్టంతో అలసిన వెంకటడి శరీరం ఇక తన వల్ల కాదన్నట్లు తనువు చాలించేసింది. వాడికంటే పెద్దదే అయినా ముసలమ్మ ప్రాణం గట్టింది. ఆ తర్వాత చాన్నాళ్లకు ఆవిడకూ కాలం తీరింది.

ఈ లోగానే కేశవుడికి డిగ్రీ పూర్తయింది. ట్యూషన్లు చెప్పించుకోలేని వాడి జరుగుబాటుతనం అత్తెసరు మార్కులతోనే ఏదో పూర్తయిందిలెమ్మనిపించింది. ఏ ఆదరవూ లేని పేదోణ్నంటూ ఎమ్మార్వోకు మొర పెట్టుకుంటే ఎకరం పొలం వచ్చింది. దాంతో వాడు కూడా అదే పల్లెలో చిన్న రైతు, గట్టి రైతుకూలీగా జీవనం ప్రారంభించాడు.

***

రైతు కూలీ సంఘం అనేది ఆ ఊరి వాళ్లకి మరో వింత. దాదాపు ఏడాది పొడవునా రోజుకు సుమారు యాభై మంది కూలీల్ని తనకున్న పొలాల్లో దించి పని చేయించుకునే భూస్వామి దగ్గరకు వెళ్లి 'మా కష్టాన్ని నువ్వు దోచేసుకుంటున్నావ్, ఇదిగో రేపటి నుంచి ఇంత కూలీ ఇవ్వాల్సిందే. లేకుండా పనిలోకి రాం' అని నిలదీయడం అన్నది వారికి నిబిడాశ్చర్యం. కానీ



ఆ పద్ధతిలో తమ కూలి రేటు ఒక్కసారిగా రెట్టింపు కావడం వారికి కొన్ని నెలల పాటు మింగుడుపడనంత ఆశ్చర్యంగా మిగిలింది. ఆ రైతు కూలీ సంఘం తరపున అప్పుడప్పుడూ వాడలోకి ప్యాంటూ చొక్కా తొడుక్కు వచ్చే కొత్త వ్యక్తుల్ని దేవుళ్లలాగా కొలిచే వాళ్లు. ఆ భక్తుల జాబితాలో శివుడు కూడా చేరిపోయాడు. వాళ్లు వచ్చినప్పుడు కలిసి తిరుగుతుండేవాడు. వాళ్లని కలిసి వస్తానంటూ అప్పుడప్పుడూ వెళ్లి వస్తుండే వాడు. అలా ఓసారి వెళ్లినవాడు రెండు వారాల పాటు రాలేదు. తర్వాత ఓ మునిమాపు వేళ ఇంటికొచ్చి చెప్పాడు 'ఇక నేను వారితోనే కలిసి పనిచేస్తాను. ఉండటం అంటే ఆ కనిపించే కొండల్లోనో... గుట్టల్లోనో...! బహుశా నీకు రోజూ కనిపించకపోవచ్చు. మనలాటోళ్లకు ఎలాంటి బాధలూ లేకుండా చేసేస్తా చూడు' అన్నాడు. నిజానికి శివుడింకా చాలా అన్నాడు. కానీ చివర్లో చెప్పిన ఒక విషయం మాత్రమే కేశవుడికి బాగా గుర్తుండిపోయింది. 'నా గురించి పోలీసులు తరచుగా కూడా నీ దగ్గరకు వచ్చి అడగవచ్చు. నీకేమీ తెలియదనే చెప్పు. ఒకసారి ఇంట్లోంచి పారిపోయిన వాడు మళ్లీ ఈ ఛాయల్లో కనిపించలేదని చెప్పు. ఏ మాత్రం మాట జారినా మళ్లీ నీకు కూడా ఇబ్బందే కదా' అన్నాడు. ఆ మాటలు పదేపదే గుర్తుకొస్తుంటే తన శివుడు పోలీసుల నుంచి దాచాల్సిన పని ఏదో చేస్తున్నాడని, పోలీసులకు తెలియకుండా దాగాల్సిన వ్యక్తిగా తయారయ్యాడని అర్థమైంది కేశవుడికి.

***

పొద్దుటే మొహం కడుక్కుని టీకొట్టు దగ్గరికెళ్లి పేపర్లో తలదూర్చిన కేశవుడికి కాళ్లలో వణుకొచ్చింది. పేపరు చేతిలోకి తీసుకున్నవాడల్లా చప్పున తలెత్తి చుట్టుపక్కల చూశాడు. ఎవరూ తనను చూడడం లేదు కదా అని భయపడ్డాడు. ఎవరైనా చాటుగా పొంచి గమనిస్తున్నారేమో అని కూడా అనుమానించాడు. నాయరు టీ వేసి గ్లాసు చేతికి అందించినా దాన్ని చప్పరించడం మరచిపోయాడు. అప్పుడప్పుడూ వెనక్కి, పక్కలకు చూసుకుంటూ భయంభయంగా ఇంటికొచ్చిపడ్డాడు. చద్ది తాగాలన్న విషయం గుర్తుకు రాలేదు. పొలానికి వెళ్లాలన్న సంగతీ తోచలేదు. మధ్యాహ్నానికి పొయ్యి రగిల్చి ఎసరు పడెయ్యాలన్న ధ్యాస కూడా లేదు. సూర్యుడు పడమటికి మళ్లాక ఏదో ఒకవేళలో ఆకలిగా అనిపిస్తే అప్పుడు మెత్తబడిపోయిన సద్ది తాగాడు. నీడ భయపెడుతున్నట్లు, ప్రతి చిన్న అలికిడీ తనను బెదిరిస్తున్నట్లు బిక్కుబిక్కుమంటూ ఆ కుక్కి మంచం మీదే పడుకున్నాడు.

పొద్దు గుంకింది.

ఊరంతా సద్దు మణిగింది. పొద్దుటే పేపరుతో బాటు ఊరంతా గుప్పుమన్న ఆ నిప్పు అప్పుడప్పుడే చల్లారుతోంది.

'టక్...టక్...టక్...'మంటూ చప్పుడు చేసింది తలుపు.

లేవడానికి కూడా శక్తి లేని తనను ఆ తలుపు చప్పుడే చేయి పట్టుకుని లేపినట్లు మెల్లగా లేచి వచ్చి తలుపు తీశాడు.

ఎదురుగా ఇద్దరు వ్యక్తులు. ఒకడు పంచె, మరొకడు ప్యాంటు వేసుకుని ఉన్నారు. దారిన పోయే బాటసారులు కాదని అనిపించేటట్లే ఉన్నారు. పంచె వ్యక్తి మంచంపై కూర్చుంటే, ప్యాంటు వ్యక్తి గుడిసె అంతా కలియదిరుగుతూ అంతా గమనిస్తున్నాడు. వారిని అదివరకెప్పుడూ చూసి కూడా ఎరగకపోయినా 'మీరెవరో తెలిసిపోయింద'న్నట్లుగా కేశవుడు వారగా గోడకు ఆని ముడుచుకుని నిల్చున్నాడు.

వాడికి ఆ ఉదయం పేపరు చూసినప్పుడే అర్థమైపోయింది. ఇలాంటిదేదో జరుగుతుందని.


ఆ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ని ముందురోజు అర్ధరాత్రి సమయంలో నక్సలైట్లు పేల్చేశారు. ఆ సమయంలో రాత్రి కాపలా ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లూ బాగా తాగి ఉన్నారు. వారి నోట్లో గుడ్డలు కుక్కి, ఇద్దర్నీ కట్టి స్టేషనుకు దూరంగా పడేసి, స్టేషన్లో ఉన్న తుపాకుల్ని తీసేసుకుని మరీ భవనాన్ని పేల్చేశారు. ఈ సంఘటనకు బాధ్యులుగా పోలీసులు అనుమానిస్తున్న వారిలో దళనాయకుడు కాళప్ప అలియాస్ నారాయణ, చిన్నక్క అలియాస్ సుమతి, భూపతి అలియాస్ శివుడు తదితరులు ఉన్నారని అందులోని వార్త.

'మీ తమ్ముణ్ణి జూసి ఎన్నాళ్లయింది...' మంచం మీద కూర్చున్న వ్యక్తి అడిగాడు.

'వాడు పారిపోయింది మొదలు ఎన్నడూ ఇటువైపు రాలేదు సార్. రెండు నెలల ముందు టౌన్లో కనిపిస్తే పలకరించబోయేలోగా...' టప్‌మన్న చప్పుడు. గోడకున్న మట్టిపూత ఒక పెళ్లగా ఊడి కిందపడింది. తల బొప్పి కడితే 'అమ్మా' అని చిన్నగా మూల్గుతూ కేశవుడు రెండు చేతుల్తో తలపట్టుకున్నాడు. ఇంట్లో పచార్లు చేస్తున్న ప్యాంటు వ్యక్తి ఒక్కసారిగా ఒడిసిపట్టుకున్న జుట్టు వదల్లేదు. కేశవుడికి కళ్లలో నీళ్లు చిప్పిల్లుతున్నాయి. 'చెప్పరా కొడకా... ఏషాలేస్తున్నావా...' అంటూ అలాగే జుట్టుపట్టుకుని వెనక్కు వంగదీశాడు. తలవదలి రెండు చేతులూ జోడిస్తూ 'అమ్మతోడు సార్... నాకు తెలియదు సార్' అన్నాడు.

మంచంపై వ్యక్తి వదిలేయ్ మన్నట్లు చేతితో సంజ్ఞ చేస్తూ 'నిజమే. నీకు తెలియదు. నీ తమ్ముడు ఏం చేస్తున్నాడో తెలియదు. ఈ కేసు ఎంత గట్టిదో తెలియదు. పట్టుబడితే ఏం జరుగుతుందో తెలియదు. నీకేం జరుగుతుందో కూడా తెలీదు' అన్నాడు రాగయుక్తంగా.

కేశవుడికి అప్పటికే చెమటలు కారుతున్నాయి. పచార్లు చేస్తున్న వ్యక్తి రెక్కల్లేని కిటికీ దగ్గరకెళ్లి వీధిలోకి చూస్తూ నిల్చున్నాడు.



మంచంపై వ్యక్తి కొనసాగించాడు. 'నీ తమ్ముడి గురించి ఏ సమాచారం తెలిసినా నువ్వు మాకు చెప్పాలి. టొనుకొచ్చి చెప్పాలి. లేకుంటే ఇదిగో ఈ ఫోన్ నెంబరుకు చెప్పాలి. తేడాలు వచ్చినట్లు నాకు అనుమానం రానివ్వకు. నేను లా అండ్ ఆర్డర్ నుంచి సిఐడి డిపార్టుమెంటు మారాక లాఠీల్తో కొట్టే అలవాటు తప్పిపోయింది. దెబ్బ తగలరాని చోట తగిలిందనుకో... ఏమో... ఫరెగ్జాంపుల్... లాకప్‌డెత్ అనడానికి కూడా వీలుండదు. ఎందుకంటే నిన్ను మేం అసలు అరెస్టు చూపివ్వంగా...'

కేశవుడికి వెన్నులో వణుకు తగ్గలేదు. వంగి కూర్చున్న వ్యక్తి కాళ్ల దగ్గర నేలను చేతుల్తో అంటి కళ్లద్దుకుంటూ 'మీరు చెప్పినట్లే చేస్తానయ్యా. నన్ను నమ్మండి. నాకేం తెలీదు' అన్నాడు.

కిటికీ దగ్గర ఉన్న వ్యక్తి ప్యాంటు జేబులో చేయి పెట్టుకుని తలుపుతీసి వెలుపలికి వెళ్లి కాసేపాగి లోపలికి వంగి 'రండి' అన్నాక కూర్చున్న వ్యక్తి 'వస్తాం' అంటూ లేచి, 'మేం రాకూడదని దేవుణ్ణి కోరుకో' అన్నాడు వెలుపలికి అడుగేస్తూ.

***

నాలుగు రోజులు సాదాసీదాగా గడిచిపోయాయి.

ఆ తర్వాత ఒక ముఖ్యమైన సంఘటన జరిగింది. ఓ రోజు హెడ్ కానిస్టేబుల్ ఒకడు భార్యను పుట్టింటికి పంపుతూ బస్సు ఎక్కించడానికి స్టాండుకు వెళ్లాడు. ఎక్కించి వెనుదిరుగుతుండగా, కానిస్టేబుల్‌ను గమనించిన ఓ వ్యక్తి బాత్‌రూమ్ పక్కకు తప్పుకున్నాడు. వాడు తప్పించుకోవడం చూసి ఇదేదో పదో పరకో ముట్టే వ్యవహారం లాగుంది అనుకున్న కానిస్టేబుల్ ఒక్క ఉదుటున పరుగెత్తి వాణ్ణి ఒడిసిపట్టుకున్నాడు. వెనుక నుంచి చొక్కా కాలర్ పట్టుకుని తన వైపు తిప్పుకునే లోగానే ఆ వ్యక్తి భుజానికి ఉన్న సంచీలోంచి చిన్న పిస్తోలు తీయడమూ, ఆ క్లోజ్ రేంజిలోంచి కానిస్టేబుల్‌ను కాల్చడమూ ఒక్కపాటున జరిగిపోయాయి.

'పోలీసుల సంగతి నీకు సరిగా తెలియదు. శాంతిభద్రతలు సర్వనాశనమైపోయి ఊరుఊరంతా వల్లకాడైపోయినా మేం పట్టించుకునేది ఒక ఎత్తు. మా డిపార్టుమెంటు మనిషిని గనుక కోల్పోతే స్పందించేది మరో ఎత్తు' ఇదివరలో పంచెకట్టుకు వచ్చిన వ్యక్తి ఉపోద్ఘాతంలా అన్నాడు. ఈ సారి ఇద్దరూ ప్యాంట్లు వేసుకుని వచ్చారు. కేశవుడికి ఈ వ్యవహారం మొత్తం తన చుట్టూ ఎందుకు తిరుగుతోందో అర్థం కావడం లేదు.

'సార్.... నాకు నిజంగా... '

'తెలీదనకు' అని కాసేపు ఆగి, మళ్లీ కొనసాగించాడు.

'ఓ పనిచేద్దాం. నువ్వు మాతో రా. నిన్ను అరెస్టు చేయం. చేయడానికి ప్రస్తుతానికి రూల్సు ఏమీ లేవు కూడా. కానీ నువ్వు మా వద్ద ఉంటే మీ శివుడు దొరుకుతాడని ఓ నమ్మకం' అన్నాడు. కేశవుడికి ఏడుపొచ్చేసింది. ఒక్కసారిగా ఆయన కాళ్లపై పడిపోయాడు. సమాధానంగా అతను జుట్టు పట్టుకుని పైకి లేపాడు.

'రిహార్సల్స్ వేసే సమయం దాటిపోయింది, పద' అన్నాడు.

అప్పటివరకూ కిటికీ వద్ద నిల్చుని చూస్తున్న వ్యక్తి ప్యాంటు జేబులో చెయ్యి ఉంచి రివాల్వర్‌ను పిడికిట బిగించి పట్టుకుంటూ నెమ్మదిగా తలుపు తీసి బయటకు కదిలాడు. లోపలి వ్యక్తి జుట్టు వదిలి చొక్కా కాలర్ వెనుక నుంచి ఒడిసిపట్టుకున్నాడు. అంతలోనే 'ఢాం' అన్న శబ్దం వినిపించింది. బయటకు వెళ్లిన వ్యక్తి అలాగే లోపలకు విరుచుకుపడిపోయాడు. తూటా కుడి భుజంలో దిగబడి ఉంది. చేయి ప్యాంటు జేబులోనే ఉంది. కాలర్ పట్టుకున్న వ్యక్తి ప్యాంటు జేబులోంచి రివాల్వర్ తీసి అదే చేత్తో కేశవుడి పొట్టలో గట్టిగా గుద్దుతూ, 'అన్నాతమ్ముళ్లిద్దరూ వేషాలేస్తార్రా' అంటూ నాలుగు బూతు మాటలు అన్నాడు. నేల మీద పడిన వ్యక్తి గాయాన్ని ఓర్చుకుంటూ లేచి మంచంపై కూర్చున్నాడు. అంతలో ఓ జీపు ఇంటి ముందు నుంచి రయ్యిన దూసుకెళ్లింది. అందులోంచి ఓ రాయికి కట్టిన కాగితం ఇంటి ముంగిట పడేశారు.

కేశవుడినే బయటకు పంపి దాన్ని తెప్పించి ఆ వ్యక్తి చదివాడు. 'అకారణంగా హాని తలపెడితే ఇదే గతి' అని రాసి ఉంది.

'ఒక్కడే వచ్చాడని అనుకున్నట్లున్నారు' అంటూ కేశవుడితో చెప్పాడు. 'ఇప్పుడు నిన్ను అరెస్టు చేస్తున్నాను. మీ సోదరుడి గురించి ప్రశ్నించేందుకు మీ ఇంటికి వచ్చిన మాపై ఇంట్లోంచి కాల్పులు జరిగాయి. నువ్వు నక్సలైట్లకు ఆశ్రయమిచ్చావు. మా మీద కాల్పులకు పురికొల్పావు - ఇదే నీ మీద కేసు. దీనికి బెయిలు కూడా లేదు'.

***

ఆ నేరం మీద కోర్టు కేశవుడికి నాలుగేళ్లు జైలుశిక్ష విధించింది. పక్క వాడి ఊసు కూడా పట్టకుండా తనేదో తన బతుకేదో చూసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్న తనకు నక్సలైటుకు ఆశ్రయమిచ్చిన కేసు కింద శిక్ష వేయడం ఎలా జరిగిందో కూడా వాడికి అంతుబట్టని సంగతి. ఆ ఏడాది ఉన్న ఎకరం పొలంలో పంట దిగుబడి బాగా వస్తుందనుకున్నాడు. అయితే గియితే నాలుగు రాళ్లు వెనకేసుకుని వచ్చే ఏడు సంక్రాంతి పొయ్యాక పెళ్లి కూడా చేసుకోవాలని ఆశలు పెంచుకున్నాడు. ఇంతలో అలా జరిగింది..


మాదీఫల రసాయనము
(పైత్యవికారములకు)

పైత్యాధికము వలన కలుగు అన్ని వ్యాధులకు ఇది అత్యుత్తమమైన రసాయనము. నోటిలో నీరూరుట, తల తిరుగుట, కండ్లు తిరుగుట, వాంతివచ్చునట్లుండుట, గుండెలో మంట, ఈ మొదలైన జబ్బులను సునాయాసముగా పోగొట్టును. కామిల రోగమును పోగొట్టుటకు ఈ మందు పెట్టినది పేరు. నాలుకకు రుచిని కలిగించి దేహమునందలి పిత్తమును సరిపరచి మనస్సుకు స్థిమితము చేకూర్చి పైత్యాధిక్యముచే కలుగుయే ఇతర వ్యాధిని దరిజేరనీయక వజ్రకవచమువలె రక్షణమొసగ గలది. మా మాదీఫల రసాయనమని చెప్పుటకు గర్వించుచున్నాము. అన్ని కాలములయందు అందరును ఉపయోగించ తగినది.



వైద్యరత్న పండిత
డి. గోపాలాచార్యులు

వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యుల వారి

ఆయుర్వేదాశ్రమమ్ ప్రైవేట్ లిమిటెడ్

70, జి.యన్.చెట్టిరోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017, ఫోన్: 8281381, 8214193

అరెస్టు జరిగేసరికి పోలీసుల భయంతో వాడి పొలానికి నీళ్లు పెట్టేవాళ్లు కూడా లేక పంట నిలువునా ఎండిపోయింది. ఆ సంగతి ఆ పల్లె పెద్ద జైల్లోని కేశవుడి వద్దకు మోసుకొచ్చాడు. వాడి రెండు కళ్లల్లోనూ నీళ్లు నిండాయి. అన్నాళ్లూ ఆ పొలంలో వాడు చిందించిన చెమట, రక్తం కలిసి రెండు కన్నీటి బొట్లుగా జారిపోయాయి.

తర్వాత అదే పెద్ద వాడితో అన్నాడు 'బీడుగా ఉంటే చూడలేకపోతున్నాన్రా' అని. కౌలు ఇచ్చుకోగల స్థోమత లేదుగానీ దాని సారం చచ్చిపోకుండా జైలు నుంచి వచ్చే వరకూ తాను సాగుచేసుకుంటూ ఉంటానన్నాడు. కేశవుడు సరేనన్నాడు. ఆ తర్వాతి కాలంలో గట్టు మార్చి ఆ గ్రామ పెద్ద పొలాన్ని పూర్తిగా కాజేశాడని వాడికి ఎవరి ద్వారానో తెలిసింది.

వాడి పూరి గుడిసె శిథిలమైపోయింది. అసలు ఆ స్థలంలో గుడిసె ఒకటి ఉండేదని తెలియనంతగా నేలమట్టమైపోయింది. గుండెల్లో రేగిన మంటలో, నరాల్లో ఉడికిన నెత్తురో తెలియదు గానీ, ఉన్న ఒక్క ఆదరవూ పొలం చేజారిపోయిందన్న సంగతి తెలిసిన రోజు వాడికి కళ్లలో ఎర్ర జీరలొచ్చాయి. ఏదో చేయాలన్న కసితో పిడికిలి బిగుసుకుపోయింది కానీ ఆ పిడికిలి బలానికి వంగని ఊచలు, రగిలిన ఆవేశానికి భళ్లున పగలని జైలు గోడలు కలిసి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలాగా వాడిని కమ్మేశాయి. అప్పటికింకా రెండేళ్లు కూడా పూర్తిగా గడవలేదు మరి. ఏదో చేయాలని ఏదో ఒక దారిని ఎంచుకున్నా మిగతా రెండేళ్లూ గడిచాక పరిస్థితి ఎలా ఉంటుందో తెలియని స్థితి.

ఎన్ని స్పెషల్ ఫోర్సులు కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించినా కొండల్లో రాళ్లుగా, అడవుల్లో చెట్లుగా కలిసిపోయిన దళం కార్యకలాపాల్లో కూడా చాలా పరిణామాలు జరిగాయి. ఆ తర్వాత ఘటనల్లో ఒక రైల్వేస్టేషను పేల్చేశారు. మరో పోలీసుస్టేషన్ కూడా పేల్చేశారు. ఓసారి ఎన్నికలప్పుడు పోలింగ్ బూత్‌పై దాడి చేసి బ్యాలెట్ బాక్సు తగలబెట్టేశారు. ఒక్కరి ఆచూకీ కూడా దొరకకపోయినా గాలింపులు మాత్రమే పెరిగాయి. శివుడి జీవితమూ మలుపులు తిరిగిపోయింది. కాళప్ప అలియాస్ నారాయణ తర్వాత దళంలో అంతటి ప్రముఖుడిగా చెలామణీ అయిన భూపతి అలియాస్ శివుడు, అదే దళంలోని చిన్నక్క అలియాస్ సుమతిని పెళ్లి చేసుకున్నాడు. తర్వాత ఆ దళ నాయకుడు కాళప్ప అలియాస్ నారాయణ ఓసారి మంచానపడి అవసానదశలో ఉన్న తన తల్లిని చూడడానికి పల్లెకు వెళ్తే పోలీసులు పొంచి ఉండి ఎన్‌కౌంటర్ చేసి చంపేశారు. (కాళప్ప పల్లెకు వెళ్లే సంగతి దళంలోనే ఎవరో సభ్యులు పోలీసులకు సమాచారం అందించారని వినికిడి.)

***

ఆ ప్రాంతంలో అదివరలో ఎన్నడూ జరగనంత పెద్ద ఎన్‌కౌంటర్ జరిగింది ఆ రోజు. ఊరికి దూరంగా ఉన్న పొలంలోని బావి దగ్గర మోటారు కోసం వేసిన షెడ్‌లో దళ సభ్యులు పదకొండు మంది పడుకుని ఉండగా అర్ధరాత్రి వేళ పోలీసులు కాల్పులు జరిపారు. పెద్దగా ప్రతిఘటన రాలేదు. ఎదురు కాల్పుల్లో (?) ఒకరిద్దరికి చిన్న దెబ్బలు తగిలాయంతే! దాదాపుగా అందరూ పడుకుని ఉన్నవారు పడుకున్నట్టే చనిపోయారు. చిన్నక్క, భూపతి అలియాస్ శివుడు ఆరోజు రాత్రి రెండో ఆట సినిమాకు టౌనుకు వెళ్లి ఉండటం యాదృచ్ఛికం!!

'సమాజం ఒక తోవన నడుస్తోంటే నేనే దారి తప్పి నడుస్తున్నానని నాకు ఇన్నాళ్లకు తెలిసివచ్చింది. చేస్తోంది తప్పని తెలిశాక కూడా ఆ దారి వీడకపోవడం బుద్ధిలేని పని...' టీవీలో కేబుల్ నెట్‌వర్క్ వాళ్లు లొంగిపోయిన ఓ నక్సలైటు ఇంటర్వ్యూ చూపిస్తున్నారు. జైలులో ఆ రోజు టీవీ ముందు కూర్చుని చూస్తున్న వాడల్లా కేశవుడు నోరెళ్లబెట్టేశాడు. అక్కడ బుల్లితెర మీద శివుడు. హోం మంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ఆయన సమక్షంలో శివుడు సుమతి దంపతులు పోలీసులకు లొంగిపోయారు. ప్రభుత్వం పిలుపు మేరకు జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నట్లు ప్రకటించారు. మరురోజు పేపరు రాగానే అదనపు వివరాలు దొరుకుతాయేమోనని వాడు ఆబగా చదివాడు. 'ప్రభుత్వం వారికి క్షమాభిక్ష పెట్టి వారిపై ఉన్న కేసులు అన్నీ రద్దు చేసింది. బతకడానికి లక్ష రూపాయల నగదు, ఐదు ఎకరాల పొలమూ ఇచ్చింది.'

వాడికి శివుడంటే చాలా ప్రేమ. కానీ వాడికి చాలా కసిగా ఉంది. ఆ కోపం శివుడి మీద కాదని తెలుస్తునే ఉంది. ఏమీ తెలియని తనను ఇలా జైల్లో పడేసి, శివుడికి డబ్బూ, పొలమూ ఇచ్చిన రూల్సు మీద.

***

నాలుగేళ్లలో ఇంకా నాలుగు నెలలు మిగిలాయి.

రోజూలాగే పేపరు చదువుతున్న కేశవుడిని అందులో ఒక వార్త ప్రముఖంగా ఆకర్షించింది. 'ఈ ప్రాంతానికి కొత్త నక్సలైట్ల దళం వచ్చింది. వారి కార్యకలాపాల్ని గమనిస్తున్నా'మంటూ అక్కడి ఎస్పీ ఇంటర్వ్యూ అది. దాన్ని చదివి వాడు తృప్తిగా తల పంకించాడు.

అన్నాళ్లూ ఇల్లూ, పొలమూ లేని తను జైలు నుంచి విడుదలయ్యాక ఎలా బతకాలా.... అని అప్పుడప్పుడూ ఆలోచిస్తూండేవాడు.

ఆ నాలుగు నెలలూ గడిచాక వాడి పేరు ముందు కూడా 'అలియాస్' కలుస్తుంది. తర్వాత కొన్నేళ్ల వరకు...! ■

